క్లుప్తంగా

ఘనంగా చిన్న సరిగెత్తు



బాబా పక్కృద్దీన్ పీరును ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం: మొహరం వేడుకల్లో భాగంగా మండలంలోని టంగుటూరు గ్రామంలో గురువారం సాయంత్రం చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా పక్కృద్దీన్ పీరును ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పీర్ల చావిడి వద్ద గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు చేశారు. బ్రహ్మయ్య, మరి కొంతమంది యువకులు బాబా పక్కృద్దీన్ పీరును ఎత్తుకొని వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

గోపవరం : ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని గురువారం తహసీల్దారు త్రిభువన్ రెడ్డికి సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా కమిటీ మెంబర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని మడకలవారిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 891, 892/1, 892/3, 812 లలో ఉన్న ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

శాస్త్ర విజ్ఞాన ఫలాలు సామాన్యులకు అందించాలి

మైదుకూరు : శాస్త్ర విజ్ఞాన ఫలాలను సామాన్యులను అందించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ సలహా మండలి నాయకుడు మహమ్మద్ మియా అన్నారు. గురువారం మైదుకూరులో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను నిర్వహించారు. మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహ్మద్ మియా మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానంతోనే మానవుని మనుగడ ముడిపడి ఉందని పేర్కొన్నారు. మహాసభలో 2025–27 సంవత్సరాలకు జేవీవీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీఆర్ మల్లేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. మహాసభల్లో జేవీవీ నాయకులు ఏవీ రమణయ్య, ఖాజా హుస్సేన్, పార్వతి, గాయత్రి బృంద, శివప్రసాద్ రెడ్డి, సాంబశివరావు, మంజూరు బాషా,ధనుంజయ,వీరేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తొలి అడుగు కాదు.. చివరి అడుగు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనకు తొలి అడుగు కాదని, చివరి అడుగేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. 1978లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో ప్రారంభమైన చంద్రబాబు రాజకీయ జీవితం 2028కి జగన్‌తో సమాప్తం కానుందని అన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రస్తుతం ఇంటింటా తిరుగుతూ గొప్పలు చెప్పుకొంటూ తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు దొరసానిపల్లెలోని శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డితోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ అభిమానులందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. మూడు పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వంగా ఏర్పడి ఎన్నికల సందర్భంగా అలివిగాని హామీలు ఇచ్చారని రాచమల్లు వ్యాఖ్యానించారు. సుమారు 143 హామీలు ఇచ్చినా కేవలం నాలుగైదు మాత్రమే అరకొరగా అమలు చేశారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు బాండ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ బాండ్లు ప్రామిసరి నోట్‌తో సమానమని, వీటిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునన్నారు.

ఎమ్మెల్యే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి వచ్చి ప్రజలకు సేవ చేయాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. అస్వస్థతకు గురైన ఆయనకు బైపాస్ సర్జరీ చేసినట్లు ఆయన కుమారుడు కొండారెడ్డి తెలిపారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు రాగుల శాంతి, చింపిరి అనిల్ కుమార్, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల కన్వీనర్ బాణా కొండారెడ్డి, వెంకటేష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరులో పట్టపగలే చోరీ



చోరీ జరిగిన ఇంటిలో తెరిచిన బీరువా తలుపులు

మైదుకూరు : పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో గురువారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. వేద వ్యాస హైస్కూల్ పక్కనే ఉన్న ములపాకు జంగంరెడ్డి చిన్న సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దుండగులు చొరబడి బీరువాలో ఉన్న 15తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయపల్లెకు చెందిన చిన్న సుబ్బారెడ్డి ఆరేళ్ల కిందట మైదుకూరులో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తెకు వివాహం కాగా, ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల ఉన్నారు. గురువారం చిన్న సుబ్బారెడ్డి భార్య మునెమ్మ వరి నాట్లకు వెళ్లగా, ఆయన గ్రామం వద్ద సాగు చేసిన పసుపు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు.. ఇంటి ప్రధాన ద్వారం తాళాన్ని గడెలతో సహా పెకలించి లోపలికి ప్రవేశించారు. ఇంటిలో కుడి వైపున బెడ్ రూమ్‌లో ఉన్న బీరువా తలుపులను పగులగొట్టి అందులో ఉంచిన 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న భార్యభర్తలు తలుపులు పగలగొట్టి ఉండటం చూసి.. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు వస్తువులు, నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని భావించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి బాధితుల ఇంటికి చేరుకుని పరిశీలించారు. కడప నుంచి వేలి ముద్రల నిపుణులను పిలిపించారు. వారు ఇంటిలోని బీరువా, ఇతర వస్తువులపై పడిన వేలి ముద్రలను సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి

బి.కోడూరు : మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన గుంత జయరామిరెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి గురువారం గుంతపల్లె గ్రామానికి వెళ్లి జయరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



బిర్యానీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని హోటళ్లను, బిర్యానీ సెంటర్లు, చికెన్ పకోడ సెంటర్లను గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుభ్రత, లైసెన్స్ లేకుండా హోటళ్లను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రొద్దుటూరులోని చిన్న, పెద్ద హోటళ్లపై ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేపట్టామన్నారు. ఖాదరబాద్‌లోని మహ్మద్ బిర్యానీ సెంటర్, డీ మార్ట్ ఎదురుగా ఉన్న లక్ష్మీనరసింహా బిర్యానీ సెంటర్, సాగర్ రెస్టారెంట్, బీజీఆర్ బార్ అండ్ రెస్టారెంట్, సుందరాచార్యుల వీధిలోని చికెన్ పకోడ సెంటర్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. చికెన్ పకోడ తయారు చేస్తున్న వారు వినియోగించే ఆయిల్ బాగలేదని తెలిపారు. కొందరికి నోటీసులు జారీ చేశామని, తీరు మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. మహ్మద్ బిర్యానీ సెంటర్ నుంచి మటన్ బిర్యానీ, చికెన్ కర్రీ ఐటమ్స్, బీజీఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లోని కొన్ని పదార్థాలను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ శాంపిల్స్‌లో ఏమైనా రిమార్క్ వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సూచించారు. ఆమె వెంట కొత్తపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల కార్యదర్శులు రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

అమ్మవారికి శోభ.. ఆర్యవైశ్య సభ

- 8వ సారి అధ్యక్షుడిగా బుశెట్టి రామ్మోహన్‌రావు
- నేడు ప్రమాణ స్వీకారం
- ఘనంగా ఏర్పాట్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవి శరన్నవరాత్రులను నిర్వహించడంలో రెండవ మైసూరుగా ప్రొద్దుటూరు పట్టణం ఖ్యాతి గడించింది. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఏడాదికేడాది నిత్యనూతనంగా దసరా ఉత్సవాలను నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. ప్రొద్దుటూరు అనగానే గుర్తుకు వచ్చేది అమ్మవారి శాలపైన కనిపించే ఎత్తైన గాలి గోపురం. ఈ ఆలయాన్ని 1890లో పట్టణానికి శోభ చేకూర్చే విధంగా నిర్మించగా 1895 నుంచి దసరా ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలను ఆర్యవైశ్యసభ వారు వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ప్రొద్దుటూరు ఆర్యవైశ్యసభ ఎన్నికలు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వారికి కూడా ఆసక్తిని కలిగిస్తాయి. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ ఎన్నికలు ఆర్యవైశ్య అనుబంధ 24 వ్యాపార అనుబంధ సంఘాలకు ఒక్కో సంఘానికి ఒక్కో సభ్యుడిని ఎన్నుకుంటారు. 24 మంది సభ్యులు కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడిగా 8వ సారి బుశెట్టి రామ్మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు ప్రమాణ స్వీకారం



బి. రామ్మోహన్‌రావు


స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్యసభ నూతన పాలకమండలి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, పుర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు

2004–2025 వరకు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బుశెట్టి రామ్మోహన్‌రావు అమ్మవారి సేవ, అధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన 5నెలల సమయంలోనే వాసవీ మాతకు బంగారు రథం తయారు చేయించారు. గజవాహనం, వెండి ఊయల, సింహాసన సేవలను అమ్మవారికి ప్రారంభించారు. అమ్మవారిశాల ప్రాకారం ఏర్పాటు చేశారు. వాసవీమాత ఉద్యానవనం అభివృద్ధి చేసి అమ్మవారి వసంత మండపం, గోశాల, వాసవీ టీజీ వెంకటేష్ జిమ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివే ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేస్తున్నారు. అమ్మవారికి బంగారు చీర, వజ్రపు చీర, కిరీటం, పాశాంకుశాలు తయారు చేయించి అమ్మవారి బంగారు భాండాగారాన్ని అభివృద్ధి చేశారు.



వజ్రపు చీరలో అమ్మవారు



అమ్మవారిశాల గోపురం